ప్రజాశక్తి

గురువారం 29 డిసెంబర్ 2022 8 పేజీలు





గుంటూరు పల్నాడు

నిలకడగా మిర్చి ధరలు

కొత్త సరుకు గిరాకి - ఎసి కాయల ధర తగ్గుదల - కర్నాటక, కేరళ నుంచి ఆర్డర్లు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి





గుంటూరు మిర్చి యార్డుకు రాయలసీమ ప్రాంతం నుంచి వస్తున్న మిర్చికి గిరాకి ఏర్పడింది. కోల్డ్ స్టోరేజిల్లో నిల్వ ఉంచిన మిర్చికి గత నెల వరకు మంచి ధరలు రాగా ఈ నెల రెండో వారం నుంచి క్రమంగా ధరలు తగ్గుముఖం పట్టాయి. అయితే కొత్తగా గత నెల రోజుల కాలంలో కోసి ఆరబెట్టిన మిర్చికి మాత్రమే యార్డులో మంచి ధరలు వస్తున్నాయి. అంతేగాక వీటికి కర్నాటక, కేరళ నుంచి ఆర్డర్లు లభించాయి. ఈ రెండు రాష్ట్రాలకు చెందిన పౌరసరఫరాలశాఖ ద్వారా దాదాపు 20 వేల టన్నుల వరకు ఆర్డర్లు లభించాయి.

ప్రస్తుతం రోజుకు సగటున 30 వేల టిక్కీలు వరకు వస్తున్నాయి. అయితే ధరలు గత వారం కంటే ఈ వారం స్వల్ప హెచ్చు తగ్గుదలతో నిలకడగా ఉన్నాయి. బుధవారం యార్డుకు వచ్చిన సరుకులో నాన్ ఎసి కామన్ వెరైటీ కనిష్ట ధర క్వింటాళ్ రూ.9 వేలు ఉండగా గరిష్ట ధర రూ.27 వేలుగా వచ్చిందని అధికారులు తెలిపారు. నాన్ ఎసి స్పెషల్ వెరైటీ తేజ కనిష్ట ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.22 వేలు, బాడిగ కనిష్ట ధర రూ.12 వేలు, గరిష్ట ధర రూ.26 వేలు పలికింది. దేవనూరు డీలక్సు గరిష్ట ధర రూ. 25 వేలు పలికింది. ఎసి కామన్ వెరయిటీ సగటు కనిష్ట ధర రూ.10,500, గరిష్ట ధర రూ.17 వేలకు తగ్గింది. గత వారం రూ.25 వేల ధర రాగా ఈ వారం రూ.8 వేల వరకు తగ్గింది. ఎసి స్పెషల్ వెరయిటీ తేజ కనిష్ట ధర రూ.10,500 వేలు, గరిష్ట ధర రూ.21 వేలు, బాడిగ కనిష్ట ధర రూ.22 వేలు, గరిష్ట ధర రూ.25 వేలు లభించింది.

కొన్ని వెరైటీలు క్వింటాళ్ రూ.30 వేల నుంచి 40 వేల వరకు లభించాయని చెబుతున్నారు. గత వారం కంటే ఈ వారం మొత్తం అన్ని రకాలకు క్వింటాళ్‌కు వెయ్యి నుంచి రూ.2 వేల వరకు పెరిగాయి. తేజ, బాడిగ, కొత్తవి 2043 రకం ధరలు భారీగా పెరుగుతున్నాయి. 2043 రకం కొంత సరుకు గరిష్టంగా రూ.40 వేల వరకు పలికింది. కొత్త మిర్చికి సంబంధించి వివిధ రకాల మిర్చి ధరలు ఇలా ఉన్నాయి. 341 రకం కనిష్ఠం రూ.19 వేలు, గరిష్ఠం రూ.25 వేలు, 273 రకం రూ.16 వేలు-220, అర్మూరు రకం రూ.16 వేల

▶ 2లో



నిరసన ర్యాలీలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య

చెత్తపన్ను రద్దు చేసే వరకూ ఆందోళనలు

మంగళగిరిలో ర్యాలీ, నిరసన

వార్త మెయిన్‌లో

పేటలో మంత్రి రజిని అరాచకాలు

- ప్రైవేటు ఆర్మీ, సిఎం కుటుంబం పేరుతో దారుణాలు
- బాధితులంతా వైసిపికి చెందిన వారే : పత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అధికారంలోకి వచ్చిననాటి నుండి మంత్రి విడదల రజిని అరాచకాలకు అంతేలేకుండా పోయిందని, చిలకలూరిపేటలో ప్రైవేటు ఆర్మీని ఏర్పాటు చేసుకుని సిఎం, సిఎం కుటుంబీకులకు చెందిన కంపెనీల పేర్లు ముందు పెట్టుకుని రూ.వేల కోట్ల విలువ చేసే గ్రానైట్ భూములను లాక్కుంటున్నారని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలు ఎన్నో ఏళ్లుగా సాగుకు చేసుకుంటున్న భూమల నుండి వారిని బెదిరించి నెట్టేసి ఆ

▶ 2లో



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

ఒకటిన గుంటూరుకు చంద్రబాబు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు వికాస్ నగర్‌లో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు జనవరి ఒకటిన పర్యటించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం 3.00 గంటలకు సదాశివ నగర్‌లోని వికాస్ హాస్టల్ మైదానంలో నిర్వహించే జనతా వస్త్రాల పంపిణీలో ఆయన పాల్గొంటారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాకినేని పెద్దరత్తయ్య, టిడిపి తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు నసీర్ అహ్మద్, కోవెలమూడి రవీంద్ర, రాష్ట్ర కార్యదర్శి చిట్టాబత్తిన శ్రీనివాసరావు, నాయకులు అఫ్జల్, కె.శ్రీనివాస్‌రెడ్డి, యు.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో కలెక్టర్, ఇతర అధికారులు, బ్యాంకర్లు

రుణాలను మంజూరు చేయండి..

- బ్యాంకర్లను కోరిన పల్నాడు కలెక్టర్
- డిజిటలైజేషన్ 31 నాటికి పూర్తి కావాలని ఆదేశం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జగనన్న బడుగు వికాసం, జిల్లాల నిర్వహిస్తున్న నవోదయం కార్యక్రమాల్లో వస్తున్న దరఖాస్తులను పరిశీలించి రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి కోరారు. బ్యాంకర్లు, అధికారులతో డిసిసి, డిఎల్ఆర్సీ సమావేశం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. జిల్లాలో డిసెంబర్ 31 నాటికి 100 శాతం డిజిటలైజేషన్ కార్యక్రమం పూర్తి కావాలన్నారు. డిసిసి, డీఎల్ఆర్సీ సమావేశాలకు బ్యాంకుల నుండి ప్రతినిధులు వేరువేరుగా కాకుండా కలిసి వస్తేః సమస్యల పట్ల అవగాహన ఏర్పడి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. సెప్టెంబర్ 30 వార్షిక సంవత్సరం చివరి నాటికి ప్రాధాన్యత రంగంలో రూ.8579 కోట్లకుగాను రూ.6,002 కోట్లు ఖర్చు చేయడం జరగడం ద్వారా 70 శాతం అభివృద్ధి సాధించినట్లు వివరించారు. వ్యవసాయ శాఖకు సంబంధించి రూ.6197 కోట్లు గాను రూ.5059 కోట్లు ఖర్చు చేసి 81.6 శాతం వృద్ధి సాధించామని, విద్యారంగంలో రూ.60.30 కోట్లకు గాను రూ.24.17 కోట్లు ఖర్చు చేసి 40.8 శాతం సాధించామని అన్నారు. గృహ నిర్మాణానికి రూ.367.64 కోట్ల రుణ లక్ష్యం కాగా రూ.71.90 కోట్లు వెచ్చించి 19.55

▶ 2లో



ఐఎంఎకు మూడు జాతీయ అవార్డులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రజారోగ్య పరిరక్షణకు, వైద్యుల సంఘానికి అందించిన సేవలకు గాను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ జాతీయ స్థాయిలో 2021-22 సంవత్సరానికి 3 అవార్డులను అందుకుంది. రాష్ట్ర కార్యదర్శిగా కోవిడ్ సమయంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, వైద్యులకు, వైద్యసంఘానికి అందించిన సేవలకు ఐఎంఎ జాతీయ అధ్యక్షుని ఉత్తమ రాష్ట్ర కార్యదర్శి అవార్డును డాక్టర్ గార్లపాటి నంధకిషోర్, కార్డియాలస్ట్‌గా ఉత్తమ సేవలందించినందుకు, కార్డియాలజీ రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించినందుకు రమేష్ హాస్పిటల్స్ కార్డియాలజీ విభాగం అధిపతి డాక్టర్ పి.ఎన్.ఎస్.హరితకు, ఐఎంఎ గుంటూరు శాఖ కార్యదర్శిగా అందించిన సేవలకు, ఐఎంఎ జాతీయ స్థాయిలో ప్రజలకు, వైద్యులకు అందిస్తున్న సేవల డైరెక్టరీని ప్రచురించినందుకుగాను డాక్టర్ టి.సేవకుమార్‌కు అవార్డులు లభించాయి. ఈ అవార్డులను ఈనెల 26, 27, 28 తేదీల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలహాబాద్‌లో జరిగిన ఐఎంఎ జాతీయ సదస్సులో జాతీయ అధ్యక్షులు డాక్టర్ సహజా నంద ప్రసాద్ సింగ్ నుండి అందుకున్నారు.

నిలకడగా మిర్చి ధరలు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి రూ.24 వేలు, నంబరు-5 రకం రూ.20 వేల నుంచి రూ.26 వేలు ధరలు పలికాయి.

ప్రస్తుతం కొత్త సరుకు ధరలు తెలంగాణలో కూడా ఆశాజనకంగా ఉన్నాయని వ్యాపారులు తెలిపారు. ఖమ్మం మార్కెట్‌లో సగటు ధర రూ.20 వేల వరకు పలికిందని వ్యాపారులు తెలిపారు. తొలి విడత కోసి కల్లాల్లో ఆరబోసిన మిర్చి మరికొద్ది రోజుల్లోనే యార్డుకు రానుంది. ప్రస్తుతం ఉదయం 8 గంటల వరకు మంచు ప్రభావం ఉంటోందని, తరువాత కూడా ఎండ తీవ్రత తక్కువగా ఉండటం వల్ల కాయల్లో తేమ ఉండటంతో సరుకు యార్డుకు రావడం లేదు. గత మూడు రోజులుగా మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత పెరుగుతోంది. దీంతో క్రమంగా ఎండలు పెరిగితే యార్డుకు మరో వారం రోజుల తరువాత రద్దీ పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. సంక్రాంతి తరువాత గుంటూరు, పల్నాడు, ప్రకాశం, ఎన్‌టిఆర్ జిల్లాల్లో తొలి విడత కోతలకు సంబంధించిన మిర్చి ఒకేసారి భారీ వస్తుందని భావిస్తున్నట్టు యార్డు కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

రుణాలను మంజూరు చేయండి..

(మొదటి పేజీ తరువాయి)

శాతమే సాధించామని చెప్పారు. ఈసారి సమావేశాల్లో సూక్ష్మ మధ్య తరహా పరిశ్రమలకు సంబంధించి పూర్తి వివరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విదేశీ విద్యకు సంబంధించి ఏ బ్యాంకు వారైనా లోను మంజూరు చేశారా? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీఎంఈజీపి కార్యక్రమం కింద పెండింగ్లో ఉన్న లోన్లను త్వరితగతిన నిబంధనల మేరకు మంజూరు చేయాలని కోరారు. అనంతరం పశుసంవర్ధక శాఖ, ఉద్యాన శాఖలపై సమీక్షించారు.

కోటప్పకొండ వద్ద జలవిహార్ అభివృద్ధికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి అవసరమైన లోన్ మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరారు. కార్యక్రమ అనంతరం నాబార్డ్ ద్వారా పొటెన్షియల్ లింక్ క్రెడిట్ ప్లాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. నాబార్డ్ అధికారి కార్తీక్, అనిల్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వెంకటేశ్వరరావు, కాంతారావు, నవోదయం కో-ఆర్డినేటర్ సంజీవరావు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న మాట్లాడుతున్న పోలీసులు

అంబటిని దూషించిన జనసేన కార్యకర్త అరెస్టు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

మంత్రి అంబటి రాంబాబును దూషించిన కేసులో జనసేనపార్టీ కార్యకర్తను సత్తెనపల్లి పోలీసులు అరెస్టు చేశారు. సత్తెనపల్లి సిఐ శోభనబాబు కథనం ప్రకారం ఈనెల 18న దూళిపాళ్లలో జనసేన పార్టీ నిర్వహించిన సభకు రామిశెట్టి లక్ష్మీనారాయణ అనే కార్యకర్త మంత్రి రాంబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈమేరకు సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి తన వాయిస్‌ను సోషల్ మీడియాలో పోస్టింగ్స్ పెట్టారు. ఈ అంశంపై వైసిపి నాయకులు వల్లెం నరసింహారావు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి బుధవారం రామిశెట్టి లక్ష్మీనారాయణను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు రిమాండ్ విధించిందని సిఐ తెలిపారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

ప్రజాశక్తి -అమరావతి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా వాలంటీర్లు చూడాలని పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. నియోజకవర్గంలోని గ్రామ సచివాలయాల కన్వీనర్లు,వాలంటీర్ల ఆత్మీయ సమావేశం బుధవారం మండల పరిధిలోని ధరణికోట గ్రామంలోని జేపీ గార్డెన్స్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలిసి నియోజకవర్గ పరిశీలకులు పైలా సోమి నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ సచివాలయాల కన్వీనర్లు, వాలంటీర్లు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా మంజూరు అయ్యేలా చూడాలని సూచించారు. అలాగే జనవరి 20 తేదీ లోప గృహ సారథుల నియామకం చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా పైలా సోమి నాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

మాట్లాడుతూ వాలంటీర్లు గ్రామ సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో పనిచేసి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ సమావేశంలో నిమ్మా. విజయ సాగర్ బాబు,కె. శేషరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంపా జ్వాలా లక్ష్మీ నరసింహారావు, ఈదా సాంబిరెడ్డి,కోటా హరిబాబు,షేక్ హష్మి,మంగిశెట్టి శ్రీనివాసరావు,ఆళ్ల శ్రీనివాసరెడ్డి,విన్నకోట సాంబశివరావు,నాయుడు రాంబాబు,మాదాసు పావని,భవిరిశెట్టి హనుమంతరావు, చిల్కా సాంబయ్య, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

పేటలో మంత్రి రజిని అరాచకాలు

(మొదటి పేజీ తరువాయి)

భూములకు ఎన్‌ఒసి (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్)ను వైసిపికి చెందిన వారికే ఇప్పించారని ఆరోపించారు. ఈ మేరకు స్థానిక పండరిపురంలోని తన నివాసంలో బుధవారం మీడియాతో పుల్లారావు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల భూముల విషయంలో మంత్రితోపాటు తహశీల్దార్, రూరల్ సిఐ, రూరల్ ఎస్ఐ, విఆర్‌ఒకూ హైకోర్టు నోటీసులిచ్చిందని చెప్పారు. చిలకలూరిపేటలో మంత్రి చేస్తున్నన్ని దారుణాలు రాష్ట్రంలోని ఏ నియోజకవర్గంలోనూ లేవని, సిఎం కుటుంబీకుల పేర్లు చెప్పి మురికిపూడిలో బలవంతంగా తీసుకున్న ఎన్‌ఒసి ఉదాహరణని అన్నారు. మురికిపూడిలో కోర్టుకెళ్లిన 65 మంది రైతులు వైసిపికి చెందిన వారేనని, మంత్రి అరాచకాలను వారూ తట్టుకోలేకపోయారని అన్నారు. పసుమర్రులో పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో ప్రభుత్వం కొనుగోలు చేసిన భూముల్లో మంత్రి రూ.కోట్ల అవినీతికి పాల్పడ్డారని, దీనిపై అధికార పార్టీకి చెందిన బాధితులే కోర్టును ఆశ్రయించి నోటీసులు ఇచ్చారని, అయితే వారితో కాళ్లబేరానికి వెళ్లిన మంత్రి ఆ నోటీసులను ఉపసంహరింపజేసుకున్న విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా వారి భూములను వారికివ్వాలని సూచించారు. యడవల్లి దళితులు ఏన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న 400 ఎకరాలను కోట్టేయడంలో కథ మొత్తం మంత్రి రజినినే నడిపారని, అయితే తనపై బుదర జల్లడం దుర్మార్గమని అన్నారు. అక్కడ ఎవర్ని కదిలించిన సిఎం, ఆయన కుటుంబీకులైన అవినాష్‌రెడ్డి పేరే చెబుతున్నారని తెలిపారు. పేదలకు ఇళ్ల స్థలాల కోసం కొన్న భూమి ఎకరాకు రూ.26 లక్షలు చెల్లించగా యడవల్లి దళితులకు మూడెకరాలకు కలిపి రూ.26 లక్షలిచ్చారని అన్నారు. ఇది దళితులను మోసం చేయడం కాదా? అని నిలదీశారు. మురికిపూడి, పసుమర్రు, చీరాల రోడ్డు, యడవల్లి తదితర చోట్ల మంత్రి అన్యాయాలకు బాధితులంతా ఆమె పార్టీకి చెందిన వారేనని పుల్లారావు విమర్శించారు. బాధితులకు టిడిపి అండగా ఉంటుందన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

సిఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా వ్యతిరేక పాలనకు నిదర్శనం పెన్షన్లు తీసివేయటమేనని అందుకు నిరసనగా ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని టిడిపి వాణిజ్య విభాగం నాయకులు మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. పొన్నూరు పట్టణంలో స్థానిక టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే దూళిపాల నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో త్వరలో కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న మాదాల వెంకటేశ్వరరావు

ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- మాచర్ల : దేశ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతో ముడిపడి ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ డాక్టరు యరమల రామచంద్రారెడ్డి అన్నారు. మాజీ ఎంఎల్‌ఎ పిన్నెల్లి లక్ష్మారెడ్డి కార్యాలయంలో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సత్య నారాయణ, టి శ్రీను వాసురావు, బాబు, నాగరాజు, బిసివిరెడ్డి పాల్గోన్నారు.

నరసరావుపేట :కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు అలెగ్జాండర్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండాను అలెగ్జాండర్ సుధాకర్ పిసిసి అధికార ప్రతినిధి రాదా కృష్ణలు ఎగురవేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 1857 వ సంవత్సరం సిపాయిల తిరుగుబాటు తర్వాత ఈదేశంలో దేశవ్యాప్తంగా ఒక సంస్థ కావాలని ఆసంస్థ ద్వారా ఈదేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాడాలని నాటి నాయకులు కాంగ్రెస్ సంస్థను స్థాపించారన్నారు. . కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అనిల్,జిల్లా నాయకులు ఎస్.ఎం. బాషా,కష్ణ, ప్రవీణ్, రవికిషన్, కొండలు,స్వర్ణ శ్రీను, శివ,దార్ల రాజు మహిళ నాయకురాలు కరీమూన్, భవానీ వెంకటేష్, పూర్ణ చంద్రరావు, కంచర్ల ఇమ్ము, సవాని కాశయ్య, జయ పాల్ తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో జెండానుఎగర వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంగళగిరి:మంగళగిరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం ఆవరణలోని పార్టీ పతాకాన్ని ఇన్చార్జి షేక్ సలీం ఆవిష్కరించారు. అనంతరం మహాత్మా గాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ, రూరల్ అధ్యక్షులు జి.నాగ కుమార్, కె.పున్నారావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కూర్మాల దుర్గాప్రసాద్, కార్యదర్శి ఆర్.హనుమంతరావు, నాయకులు దర్శన శామ్యూల్, గోలి సాంబశివరావు,జి. వెంకయ్య, కార్తీక్‌లు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కేశన శంకరరావు తదితరులు

భట్రాజుల సంక్షేమానికి శేషంరాజు కృషి

ప్రజాశక్తి-తెనాలి

భట్రాజు సంఘీయులతో పాటు ఇతర బీసి కులాలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమానికి శేషంరాజు ఎనలేని కృషి చేశారని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అద్యక్షులు కేసన శంకరరావు అన్నారు. స్థానిక రామలిగేశ్వరపేట రైస్ కాలనీలో బుధవారం నిర్వహించిన తంగెళ్ళ శేషంరాజు వర్ధంతి సభలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న శంకరరావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అందరితో కలిసి మెలిసి జీవించిన శేషంరాజుకు సర్దార్ గౌతు లచ్చన్న, మర్రి చెన్నారెడ్డిలతో సంబందాలున్నాయన్నారు. బిసి విద్యార్థుల హక్కులకోసం అయన అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. భట్రాజు కార్పోరేషన్ డైరెక్టర్ కె.రామరాజు మాట్లాడుతూ కార్పోరేషన్ల ఆవిర్భావానికి శేషంరాజు ఆధ్యుడన్నారు. కార్యక్రమంలో భట్రాజు సంఘం నాయకులు ఎల్.గంగరాజు, బీసీ నాయకులు గంగాయాదవ్, కె.సాంబశివరావు, కొండంరాజు, కె.ఆంజనేయరాజు, కె.సీతారామరాజు పాల్గొన్నారు.



మ్యూజియంలో థాయిల్‌డ్ దేశస్తులు

అమరావతి మ్యూజియంలో థాయిలాండ్ దేశ స్తులు

ప్రజాశక్తి- అమరావతి

అమరావతిలో బౌద్ధ మత పవిత్ర స్థలాల సందర్శనలో భాగంగా అమరావతి పురావస్తు శాఖ సంగ్రహలయాన్ని థాయిలాండ్ దేశస్తులు 27మంది సందర్శించారు. వారి వెంట హైదరాబాద్ నుంచి గైడ్ గా మధుబాబు వచ్చారు. ఈ కార్యక్రమంలో మ్యూజియం ఇంచార్జ్ టి. చిన్నబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

పింఛన్లు తొలగించడం అన్యాయం

ప్రజాశక్తి- తెనాలి

వైసిపి ప్రభుత్వం తాము పింఛన్లు పెంచామని గొప్పలు చెబుతూనే పింఛన్లు కోత విధిస్తుందని, పేద ప్రజల పింఛన్లు తొలగించడం అన్యాయమని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి పట్టణంలోని 16వ వార్డులో ఆయన పర్యటించారు. ప్రజలను కలిశారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. పింఛన్ల కోత పై అర్హులైన లబ్ధిదారులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలు ఆయనకు వివరించారు.. అడిగిన వారికందరికి పింఛన్లు ఇస్తున్నామని చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని, లేనిపోని ఆంక్షలతో పింఛన్లు కట్ చేస్తున్నారని చెప్పారు. అబద్దాల ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. కౌన్సిలర్ దివి అనిత పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పాఠాలు సులభంగా అర్థమవడానికి ట్యాబ్‌లు

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రభుతం అందిస్తున్న బైజూస్ ట్యాబ్‌ల వల్ల విద్యార్థులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తాడేపల్లి ఎంఇఒ సత్యనారాయణ తెలిపారు. బుధవారం నులకపేట ఉర్దూ పాఠశాలలో బైజూస్ కంపెనీ ట్యాబ్‌లను ఆయన పంపిణీ చేశారు. సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె ముస్తఫా అధ్యక్షత వహించారు. ఎంఇఒ మాట్లాడుతూ ట్యాబ్‌ల్లో కేవలం విద్యకు సంబంధించిన అంశాలు మాత్రమే ఉంటాయని తెలిపారు. వేరే ఆప్షన్లు వినియోగించుకోవడానికి ఈ ట్యాబ్‌లు పని చేయవన్నారు. విద్యార్థులకు సులభతరంగా పాఠ్యాంశాలు అర్థమయ్యే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ విధానాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. ఎంటిఎంసి బాలోత్సవం నిర్వాహకులు గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం ప్రాథమిక స్థాయి నుంచే అలవర్చుకోవాలన్నారు. ఈ నెల 3వ తేదీన జరిగిన బాలోత్సవంలో పాల్గొని సీనియర్స్ విభాగంలో కోలాటం ప్రదర్శించిన ఉర్దూ పాఠశాల విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాల్గొన్న 24 మందికి గోల్డ్ మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. బాలబాలికల్లో సృజనాత్మకతను వెలికితీయడానికే బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఈదులమూడి డేవిడ్‌రాజు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని విద్యార్థులు చదువులో రాణించాలని కోరారు. గతంలో ఎన్నడూలేని విధంగా విద్యాభివృద్ధికి ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తుందని చెప్పారు. నాడు-నేడు పనుల్లో భాగంగా అనేక పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చెర్మన్ ఎస్‌కె జిలానీ, ఎంటిఎంసి బాల్సోతవం నిర్వాహకులు డి.కోదండ రామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడికొండూరు: సాంకేతికతతో కూడిన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. బుధవారం మేడికొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ఆధారిత ట్యాబ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులకు సాంకేతిక విద్య కోసం 4.50 లక్షల ట్యాబ్ల పంపిణీకి రూ.588 కోట్లు కేటాయించిందన్నారు. ట్యాబులు తీసుకుంటే అమ్మ ఒడి పథకాన్ని నిలిపేస్తారనేది అబద్ధం అని గిట్టని వాళ్ళు చేసే ప్రచారాన్ని నమ్మొద్దని తెలిపారు. వైసిపి కన్వీనర్ తాళ్లూరు వంశీ, ముత్యాల బాలస్వామి, చీలి నాగేశ్వరరావు, రాజశేఖర్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి జయరామిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపర: మండల కేంద్రమైన కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బుధవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ట్యాబులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 301 విద్యార్థులకు ట్యాబులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరం పద్మావతి, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, తహాశీల్దార్ నాంచారయ్య, ఎంపీడీవో పి శ్రీనివాసులు, సర్పంచ్ పిల్లి రాధిక, ప్రధానోపాధ్యాయులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరు: మందడం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ లో బుధవారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ ఎం కోటేశ్వరరావు, గ్రామ పెద్దలు అలూరి శ్రీనివాసరావు, దేవరపల్లి నరసింహారావు, విధ్యా కమిటీ చైర్మన్ పులి ప్రసాద్ పాల్గొన్నారు.


మేడికొండూరు


కొల్లిపర


తాడేపల్లి

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- బెల్లంకొండ

ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన సంఘటన బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. ఆదివారం గ్రామ సమీపంలోని స్మశాన వాటిక దగ్గర ఆటో బైక్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న అదే గ్రామానికి చెందిన మహంకాళి రామారావు(47)ను ఆటోఢీకొనడంతో తీవ్ర గాయాల అయ్యాయి. పరిస్థితి విషమించడంతో వెంటనే గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకి తరలించారు. రామారావు బుధవారం చికిత్స పొందుతూ మరణించాడు. విషయం తెలుసుకున్న బెల్లంకొండ ఎస్సై సుధీర్ కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.


ఎం. రామారావు


ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై రవీంద్రారెడ్డి

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కొల్లిపర: మద్యం సేవించి ఆటోలు నడపడం నేరమని కొల్లిపర ఎస్సై ఆర్ రవీంద్రారెడ్డి ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో బుధవారం ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించి మాట్లాడుతూ పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు . అతివేగంప్రమాదకరమని ఆటో డ్రైవర్ తప్పనిసరిగా ప్రమాద బీమా పొల్యూషన్ తదితర పత్రాలను ఉంచుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు ఆటోలో ప్రయాణిస్తున్నట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్యామ్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయడం లేదని ఫిర్యాదు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ కమిషన్‌ను సంప్రదించిన బాధితుడు

ప్రజాశక్తి -మంగళగిరి : తనభార్య మృతి ప్రభుత్వ అధికారులు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీస్ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన సంఘటన బుధవారం జరిగింది. తాడిపత్రి నివాసి 2019లో తన భార్య అక్తర్‌బాను కాన్పు కోసం అనంతపురం ఆస్పత్రిలో చేర్పించగా ఆమెకు O+ve రక్తానికి బదులు B+ve రక్తం ఎక్కించడంతో తన చనిపోయిందని అన్నారు. బాధితుడు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయగా .అప్పటి జిల్లా కలెక్టర్, మంత్రి, ఉన్నత అధికారులు, నన్ను సంప్రదించి పిల్లల చదువులకు భాధ్యత వహిస్తమని, నాకు ఉద్యోగం, ఇంటి స్థలం, ఎక్స్ గ్రేషియ ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఎక్స్ గ్రేషియా మాత్రమే ఇచ్చి మిగిలిన హామీలు నేటివరకు అమలు చేయడం లేదని వాపోయాడు. బుధవారం మైనార్టీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె ఇక్బాల్ అహ్మద్ ఖాన్‌ని కలిసి అధికారులు ఇచ్చిన హామీలు త్వరగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే స్పందించిన చైర్మన్ సంబంధిత విషయాల పూర్వపరాలు పరిశీలించి సమస్య త్వరతగతిన పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పించనుదారులకు నోటీసులు

ప్రజాశక్తి-పెదనందిపాడు

పెదనందిపాడు, కాకుమాను మండలాలలో సామాజిక పెన్షన్లు పొందుతున్న పలువురికి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు నోటీసులు జారీ చేశారని సామాజిక పెన్షన్‌దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కాకుమాను, పెదనందిపాడు ఎంపీడీవోలను సంప్రదించి వివరణ కోరగా కాకుమాను మండలంలో మొత్తం 117 మంది పించను దారులకు నోటీసులు జారీ చేశామని ఎంపీడీవో డి.శరత్ బాబు తెలిపారు. నోటీసులు జారీ చేసిన వారికి నేటితో వెరిఫికేషన్ పూర్తి అవుతుందని, ఈ పరిశీలనలో అర్హులైన వారికి జనవరి 7వ తేదీ లోపు పించను నగదు అందజేస్తామని తెలిపారు. పెదనందిపాడు మండలంలో 137 మందికి నోటీసులు జారీ చేశామని ఇంచార్జ్ ఎంపీడీవో కె. సాయిలీల తెలిపారు.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 29,088
మిర్చి ఎగుమతి	: 29,572
మిర్చి నిల్వ	: 10,447

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9000 - 26500
నెం.5	10000 - 25000
273	10500 - 23000
341	10000 - 27000
4884	10000 - 20000
సూపర్ టౌన్-10	13600 - 23000
నాన్ ఎసి	
తేజ	9500 - 22000
బడిగి	12000 - 26000
దేవనూరు డీలక్స్	11500 -25000
తాలుకాయలు	4,500 - 13,500
ఎసి	
334	10000 - 10000
341	16000 -17000
తేజ	10500 - 21000
బడిగి	22000 - 25000
తాలుకాయలు	6000 - 11,000


దుగ్గిరాలలో పోలీస్ స్టేషన్ ఎదుట టిడిపి నాయకులు


తాడేపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌సి సెల్ నాయకులు

టిడిపి ఎస్‌సి సెల్ నాయకులు అరెస్టు,విడుదల

ప్రజాశక్తి- దుగ్గిరాల

ఎస్‌సిల పథకాల రద్దు చేసినందుకు నిరసనగా రాష్ట్ర టిడిపి పిలుపుమేరకు సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడిని పోలీసలు అడ్డుకొని పలువురు ఎస్‌సి సెల్ నాయకులను అరెస్టులు చేశారు. ధర్నా కార్యక్రమం చేపట్టిన పార్టీ ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజును, ఎస్‌సి సెల్ కార్యవర్గ సభ్యులు తెనాలి రూరల్ కోపల్లి శ్రీనివాస్‌ను తాడేపల్లిలో పోలీసులు అరెస్టు చేసి దుగ్గిరాల పోలీస్ స్టేషన్‌కు తరలించార . ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎంఎస్ రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన 27 పథకాలను ఈ ప్రభుత్వం రద్దు చేసినందుకు నిరసనగా ధర్నా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. టిడిపి మండల నాయకులు వీరికి మద్దతుగా నిలిచారు. పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చి వారికి మద్దతు ప్రకటించారు. వీరిలో రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి గూడూరు వెంకటరావు మండల పార్టీ అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత, తాళ్ల అశోక్, బుస నాగరాజు ,కాకబాబు, ఎన్ రవి, చంటి తదితరులున్నారు.

తాడేపల్లి: తాడేపల్లి బైపాస్‌రోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో స్థానిక టిడిపి ఎస్‌సి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఉండవల్లికి చెందిన రాష్ట్ర ఎస్‌సి సెల్ నాయకులు డి.జ్యోతిబస్, గుంటూరు పార్లమెంట్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు బి.రామకృష్ణారావు తదితరులను సిఐ శేషగిరిరావు, ఎస్‌ఐలు నాగరాజు, వినోద్ అ ద ు ప ు లో కి తీసుకున్నారు . సాయంత్రానికి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ట్యాబ్‌లు


యడ్లపాడులో ట్యాబ్‌లు అందిస్తున్న మంత్రి రజిని


ఈపూరులో ట్యాబ్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

పల్నాడు జిల్లాలోని పలుచోట్ల పంపిణీ చేసిన మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా విలేకర్లు

ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను జిల్లాలోని పలు పాఠశాలల్లో బుధవారం పంపిణీ చేశారు. ఇందులో భాగంగా మండల కేంద్రమైన యడ్లపాడులోని జెడ్‌పి పాఠశాలలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని అందించారు. వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, నూజెండ్ల మండలం, మండల కేంద్రమైన ఈపూరులో విద్యార్థులకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అందించారు. ఈ సందర్భంగా బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గం మొత్తం మీద దాదాపు 3 వేల మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తామన్నారు. వాటి ద్వారా ఇంగ్లీషు మీడియంతో పాటు తరగతి గదుల్లో సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్‌తో విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. 8వ తరగతిలో ప్రవేశించిన ప్రతి విద్యార్థికీ ఏ ఏడాదికి ఆ ఏడాది మారిన కంటెంట్‌తో కూడిన ఉచిత ట్యాబ్‌లు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇవి ఆఫ్‌లైన్‌లో కూడా పని చేస్తాయని చెప్పారు. విద్యా రంగానికి వైసిపి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, వివిధ సంక్షేమ పథకాలనూ అమలు చేస్తోందని చెప్పారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, విద్యతో పేదరికాన్ని జయించొచ్చని అన్నారు. కార్యక్రమాల్లో నూజెండ్ల ఎంపిపి ఎం.జయరామిరెడ్డి, తహశీల్దార్ మధుబాబు, ఎంఇఒ సాంబశివరావు, ఎంపిడిఒ జిలానిబాషా, హెచ్‌ఎం అన్నపూర్ణమ్మ, విద్యా కమిటీ చైర్మన్ వి.ప్రసాద్, ఎం.శ్రీలతాదేవి ఈపూరు ఎంఇఒ కె.బాబురెడ్డి, హెచ్‌ఎం ఆర్.గోవింద్‌రాజులు, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.నిరంజన్, జెడ్‌పిటిసి టి.చౌడయ్య, సర్పంచ పి.చెంచయ్య, పిఎంసి చైర్మన్‌లు పున్నయ్య, అంకుల్, వైసిపి మండల కన్వీనర్ కె.దేవరాజ్, ఎస్.బుచ్చయ్య, కె.శ్రీనివాసరావు, బి.ఏడుకొండలు, కె.మహేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు రావాల్సిందే : జెడ్‌పిటిసి

ఇదిలా ఉండగా ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.నిరంజన్ పాఠశాల విధులకు సరిగా హాజరవడం లేదని ఈపూరు జెడ్‌పిటిసి టి.చౌడయ్య, గ్రామస్తులు అన్నారు. దీనివల్ల సరైన పర్యవేక్షణ లేక పిల్లల చదువు కుంటుపడుతోందని అన్నారు. ఇక్కడ పాఠశాలలో జీతం తీసుకుంటూ ఇతర ప్రాంతాల్లో విధులు సరికాదన్నారు.


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సబ్‌రిజిస్ట్రార్ తదితరులు

ప్రజాశక్తి కేలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్రోసూరు

మండల కేంద్రమైన క్రోసూరులోని సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద ప్రజాశక్తి 2023 కేలండర్‌ను సబ్ రిజిస్ట్రార్ బి.భాస్కరరావు బుధవారం ఆవిష్కరించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం ముందు ఉంచడంలో ప్రజాశక్తి ముందుండడంతోపాటు ఆ కృషిలో సఫలీకృతం అవుతోందని చెప్పారు. బాబుదారితనం కలిగిన పత్రికను అందరూ చదవాలన్నారు. కార్యక్రమంలో ప్రజాశక్తి పల్నాడు డివిజన్ ఇన్‌చార్జి ఎన్.కృష్ణ, క్రోసూరు విలేకరి జె.విజయసారథిరెడ్డి, వైసిపి నాయకులు కె.ఏసురెడ్డి పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ షకీల

క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక అవకాశాలు

ప్రజాశక్తి - వినుకొండ

క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దారుఢ్యానికి దోహదపడతాయని, విద్యార్థులు విద్యుత్‌తో పాటు క్రీడల్లోనూ రాణించాలని మున్సిపల్ కౌన్సిలర్ షకీలా సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన క్రీడా పోటీలను షకీలా ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఎన్ని సమస్యలనైనా ఎదుర్కొనే శక్తిని పొందుతారని చెప్పారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఉద్యోగ, ఉపాధి రంగాల్లోనూ ప్రత్యేక అవకాశాలు ఉంటాయని తెలిపారు. అనంతరం నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ పోటీల్లో విద్యార్థులు హోరాహోరీగా తలపడ్డారు. విజేతలకు బహుమతులను నేచురల్ హెల్త్ కేర్ సొసైటీ కార్యదర్శి ఎన్.భగవాన్‌దాస్ ప్రదానం చేశారు. సంస్థ కో-ఆర్డినేటర్ భూక్యా నాయక్, నాగేశ్వరావు నాయక్, కోటేశ్వర నాయక్, బి.ఈశ్వరి పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్టుకు నిర్మల విద్యార్థులు

ప్రజాశక్తి - వినుకొండ : బాల్‌బ్యాడ్మింటన్ క్రీడల్లో తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని నిర్మల ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నిర్వాహకులు తెలిపారు. అండర్-17 బాలికల విభాగంలో భవాని, హవిలా, వైష్ణవి, శశిసాయి దీపిక, బాలుర విభాగంలో ఎస్‌కె.ఆసిఫ్, అండర్-14 బాలుర విభాగంలో సాయికుమార్, రోహిత్, ఎంపికైనట్లు వివరించారు. ఐదేళ్లుగా తమ విద్యార్థులు 12 మంది రాష్ట్రస్థాయిలో, ఇద్దరు జాతీయ స్థాయిలో రాణించారని చెప్పారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారిని కరస్పాండెంట్ సిస్టర్ డెన్నిస్, కోచ్ జోనా నాయక్, శ్రీనివాస్, సిస్టర్ సుప్రియ, క్యాష్‌ఫర్, సిస్టర్ హెచ్‌ఎం రాణి, సిస్టర్ చిన్ని అభినందించారు.



కుంట, వాగు ఆక్రమణపై విచారణ

ప్రజాశక్తి - వినుకొండ


చెక్కవాగును ఆక్రమించి వేసిన రోడ్డు

కుంట, వాగుల ఆక్రమణలపై వినుకొండలో కొద్దిరోజులుగా రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. పురపాలక సంఘం పరిధిలోని సర్వే నంబర్ 270లో 2.96 ఎకరాల విస్తీర్ణంలో నరగాయకుంట కలదు. వెల్లటూరు రోడ్డులో కొండ ఎగువతో పాటు తదితర ఎగువ ప్రాంతం నుండి వర్షం నీరు నరకాయకుంటలో చేరుతుంది. పశువులు దాహం తీర్చుకునే తాగునీటి కుంటతోపాటు, దోబీ ఘాటుగా ఉపయోగించుకునేవారు. అయితే ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా మట్టితో నరకాయకుంటను పూడ్చారు. దీనితో చుట్టుపక్కల భూగర్భ జలాలకు ఇబ్బంది కలుగుతుందని వినుకొండకు చెందిన షేక్ ఉస్మాన్ జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. పట్టణాన్ని ఆనుకొని ఉన్న చెక్క వాగును పూడ్చి 60 అడుగుల వెడల్పు రోడ్డు నిర్మించాలని కోరారు. నరగాయకుంట, చెక్క వాగును చట్ట వ్యతిరేకంగా పూడ్చివేస్తుంటే నాటి తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్లు మద్దతు ఇచ్చారని, వారిపైనా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఆర్‌డిఒ శేషిరెడ్డిని విచారణకు కలెక్టర్ ఆదేశించారు. ఇటీవల వెల్లటూరు రోడ్డుతో పాటు వివిధ మార్గాల్లో వెలసిన అక్రమ వెంచర్లలో పంట కాల్వలు, తాగునీటి పైపులైన్లు, పెట్రోలియం గ్యాస్ పైప్ లైన్లను ఆక్రమించుకొని రోడ్లు, నివాస గృహాలు నిర్మించుకున్నారని అంశంపై 10 రోజులుగా రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. అక్రమంగా వేసిన వెంచర్లకు ల్యాండ్ కన్వర్షన్ అనుమతి లేకపోవడం, ప్రజా ఉపయోగ వనరులను గుర్తించి సబ్ డివిజన్ చేసి విభజించకపోవడం వల్ల ఆక్రమణలు అధికంగా జరిగాయని అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది.



జెడ్‌పి విద్యార్థులకు ఉచితంగా ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి-దాచేపల్లి

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు రాసే విద్యార్థుల కోసం ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను మండల కేంద్రమైన దాచేపల్లి జెడ్‌పి పాఠశాల విద్యార్థులకు యుటిఎఫ్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. వీటిని ఉపయోగించుకుని జాతీయ స్థాయిలో అందించి స్కాలర్‌షిప్‌ను సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.శైలజ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వి.నాగేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు షేక్ మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు బాలరాజు, ప్రసాద్, వెంకట్రావు, రవికుమార్ నాయక్ పాల్గొన్నారు



రేషన్ సరుకులు ఇంటింటికీ ఇవ్వకుంటే చర్యలు

ప్రజాశక్తి - కారెంపూడి

ప్రతి ఇంటికీ రేషన్ బియ్యం, సరుకులు ఇవ్వకుంటే చర్యలు తప్పవని తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ మేరకు రేషన్ డీలర్లతో తహశీల్దార్ తన కార్యాలయంలో బుధవారం సమావేశమయ్యారు. జనవరి ఒకటవ తేదీ నుండి రేషన్ బియ్యం, సరుకుల పంపిణీని ఉదయం 7 గంటల నుండి ప్రారంభించాలని చెప్పారు. రోజుకు 150 కార్డుల వరకు ఇంటింటికి తిరిగి ఇవ్వాలన్నారు. సరుకుల పంపిణీలో ఎమ్‌డియు ఆపరేటర్లకు డీలర్లు సహకరించాలని చెప్పారు. దీనిపై ఫిర్యాదులు వస్తే చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. జనవరి నెల నుండి కందిపప్పు, పంచదార వంటి నిత్యావసర వస్తువులు కూడా కార్డుదార్లకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. సమావేశంలో సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహశీల్దార్ కీర్తి స్రవంతి, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనుల్లో కూలీలను పెంచాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని డ్వామా పల్నాడు జిల్లా పీడీ జోసఫ్‌కుమార్ అన్నారు. ఉపాధి హామీ పనులపై స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. గ్రామాల వారీగా జరిగిన పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని, జాబ్‌కార్డులన్నింటినీ ఆధార్‌కు అనుసంధానించాలని చెప్పారు. దీన్ని సకాలంలో పూర్తి చేయని వారిపై చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహారావు, ఏపీవో కోటేశ్వరావు పాల్గొన్నారు.



త్వరలో మరో ఇద్దరు గృహ సారధులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో వాలంటీర్లు, నూతనంగా ఏర్పాటైన సచివాలయ కన్వీనర్లతో ఎమ్మెల్యే బుధవారం సమావేశమయ్యారు. వాలంటీర్లకు తోడు వైసిపి తరఫున సచివాలయ కన్వీనర్లను నియమించామని, అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. త్వరలో మరో ఇద్దరు గృహ సారథులను నియమిస్తామన్నారు. ప్రజలందరికీ పథకాల లబ్ధిని చేకూర్చాలని సూచించారు.

ఒక్క కార్మికుడ్ని తొలగించినా ఊరుకోం

- రాజధాని పారిశుధ్య కార్మికుల ఉపాధికి భద్రత కల్పించాలి
- కార్మిక, ఉద్యోగ, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి-గుంటూరు

రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికుల ఉపాధికి భద్రత కల్పించాలని సిఐటియు, ఇతర అనేక కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఏఒక్క కార్మికుడిని తొలగించిన సహించేది లేదని హెచ్చరించాయి. కార్మికుల ఉపాధికి భద్రత కోరుతూ సిఐటియు జిల్లా కార్యాలయంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి అధ్యక్షతన మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలోని 29 గ్రామాల పరిధిలో గత 5 ఏళ్ళుగా 400మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారన్నారు. ఆ ప్రాంతంలో గతంలో ఉన్న వ్యవసాయ పనులు ఇప్పుడు లేవని, రాజధాని తరలింపు వివాదంతో నిర్మాణాలు నిలిచిపోవడంతో ఈ కుటుంబాలకు ఈ పని మినహా వేరే జీవనాధారంలేదన్నారు. రాష్ట్రంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు గతంలో రూ.12వేలు నెలవారీ జీతం ఇవ్వాలని ఉత్తర్వుల్లో ఉండగా, రూ.10వేలు ఇస్తున్నారన్నారు. గత జనవరి నుండి రాష్ట్రంలో ఔట్‌ర్సింగ్ ఉద్యోగులకు రూ.15వేలు ఇవ్వాలని ఉత్తర్వుల్లో ఉండగా, వీరికి రూ.12వేలు చెల్లిస్తున్నారన్నారు. ప్రభుత్వ శాఖల్లోని ఔట్‌సోర్సిగ్ ఉద్యోగులందరినీ ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చారని, కానీ రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులను, రాష్ట్ర సెక్రటేరియట్, హైకోర్టులో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల్ని ప్రైవేటు కాంట్రాక్టర్ ద్వారానే పనిచేయిస్తున్నారన్నారు. ఉద్యోగం ఉందన్న సాకుతో రాజధాని ప్రాంతంలో భూములులేని వ్యవసాయ కూలీలకు నెలవారీ ఇచ్చే పెన్షన్ రు.2,500లు కూడా రద్దు చేశారని తెలిపారు. 2023 జనవరి నుండి సిఆర్‌డిఎ అధికారులు తమకు బడ్జెట్ తగినంత లేనందున కార్మికులను కొనసాగించబోమని చెబుతున్నారని, ఇప్పటికే పలు రకాలుగా ఆందోళనలు చేపట్టినప్పటికీ అధికారులు హామీ ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికుల పని కొనసాగిస్తూ స్పష్టమైన ప్రకటన చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల పోరాటానికి అన్ని సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఏఐటియుసి జిల్లా కన్వీనర్ యం.హనుమంతరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈ.అప్పారావు, రాజధాని పారిశుధ్య కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు యం.రవి, ఎపి ఎఫ్‌టియు, ఐఫ్టియూ యన్.వి.కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యం.బాలాజీ, ఏఐయఫ్టీయూ(న్యూ) కూరపాటి కోటయ్య, విహెచ్‌పియస్ నాయకులు తన్నీరు సాంబయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, ఎంటిఎంసి వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యస్.యస్.చెంగయ్య, వివిధ ప్రజా సంఘాల జిల్లా నాయకులు వై.సుబ్బారావు, వై.కృష్ణకాంత్, దేవరకొండ శ్రీనివాసరావు, నన్నపనేని శివాజీ, టి.వి.జి.రవిశంకర్, యన్.రమా సుష్మా, జి రమణ, కె.శ్రీనివాసరావు, షేక్ హుస్సేన్ వలి, యం.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నేతాజి

రాజధానిలో పారిశుధ్య కార్మికుల ఆందోళన

కొనసాగింపుపై ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులను కొనసాగిస్తామని ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని, ఒక్కర్ని తొలగించినా ఊరుకోమని రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి తెలిపారు. బుధవారం తుళ్లూరులోని బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పారిశుధ్య కార్మికుల ఆందోళనలో రవి ప్రసంగించారు. కార్మికులకు పని భద్రత కల్పించాలని రాజధాని గ్రామాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయన్నారు. కరోనా హెచ్చరికల నేపథ్యంలో రాజధాని గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల్ని తొలగిస్తే గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి ప్రజలు అనారోగ్యం పాలైతే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. కార్మికులను తొలగిస్తే 400 కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజధాని గ్రామాల శానిటేషన్ కాంట్రాక్టు పొడిగించాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని రాజధాని కార్మికుల పని కొనసాగింపుకై ప్రభుత్వం, అధికారులతో సంప్రదింపులు జరపాలన్నారు. ఉద్యోగులు అనే పేరుతో కార్మికులకు తొలగించిన సామాజిక పెన్షన్ పునరుద్ధరించాలని అన్నారు. కార్మికులను ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ లోకి తీసుకోవాలన్నారు. పారిశుధ్య కార్మికులలో ఒక్కరిని తొలగించినా ఊరుకునేది లేదన్నారు. అందరినీ కలుపుకొని విశాల ఐక్య పోరాటం చేస్తామని చెప్పారు.జనవరి నుంచి కార్మికుల పని కొనసాగింపు విషయంలో అధికారులు స్పష్టత ఇవ్వకపోతే కార్మికులు,వారి కుటుంబ సభ్యులతో రాష్ట్ర సచివాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని రవి హెచ్చరించారు.


తుళ్లూరులో ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

వడ్డీ లేకుండా పన్ను చెల్లింపునకు 3 రోజులే గడువు

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు



వడ్డీ లేకుండా ప్రస్తుత అర్ధ సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లించటానికి 3 రోజులు మాత్రమే గడువు ఉందని, కావున ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపుదారులకు అనుకూలంగా క్యాష్ కౌంటర్లు ఉదయం 8 గంటల నుండి, రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని నగర కమిషనర్ పేర్కొన్నారు. నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంలోని క్యాష్‌కౌంటర్లతో పాటు అదనంగా నగరంలోని భారత్‌పేట 140 సచివాలయం, వసంతరాయపురం 148 సచివాలయం, పెద్ద పలకలూరు రోడ్డులోని 106 సచివాలయాల్లో కూడా పన్ను చెల్లించడానికి ప్రత్యేక క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. కావున జిఎంసికి చెల్లించాల్సిన ఆస్తిపన్ను, నీటిపన్ను, ఖాళీస్థలం పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. పన్ను బకాయిదార్లకు ప్రత్యేక స్లిప్‌లు అందించాలని, ఫోన్‌ల ద్వారా ప్రత్యేక కౌంటర్ల గూర్చి సమాచారం ఇవ్వాలన్నారు. 31 తర్వాత బకాయిదార్లకు నీటి కుళాయిలు, అత్యవసర సేవల నిలుపుదల నోటీసులు, ఆర్.ఆర్. యాక్ట్ ద్వారా బకాయిల వసూళ్లకు నోటీసులు సిద్ధం చేయాలన్నారు.

అందరి సహకారంతో ఉన్నత శిఖరాలకు

స్టెమ్ స్కూల్ డైరెక్టర్ ఫాదర్ భరత్ రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

గ్లోబలీకరణ నేపథ్యంలో అనంతమైన విజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకోవటంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల సహకారం ఎంతైనా అవసరమని స్టెమ్ స్కూల్ డైరెక్టర్ ఫాదర్ వై.జె.ఆర్.భరత్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక అమరావతి రోడ్డు గోరంట్లలోని నెక్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ యూత్ ఫెస్ట్ నెక్స్ సి యువజన ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు వెస్టన్ డ్యాన్స్, బందగాన పోటీలలో బాలబాలికలు పాల్గొని తమ ప్రతిభను చాటారు. విద్యార్థుల్లో మానసిక వికాసానికి యూత్ ఫెస్ట్ కార్యక్రమాలు దోహదం చేస్తాయని చెప్పారు. టాక్ షో కార్యక్రమంలో భాగంగా 11వ తరగతి విద్యార్థి ఆదిత్య 'డ్రీమ్ బిగ్, డ్రీమ్ రైట్' అంశంపై తన అద్భుతమైన ప్రసంగం ద్వారా ఆకట్టుకున్నాడు. 'పిల్లల కలలను సాకారం చేసుకోవడానికి తల్లిదండ్రులు ఎందుకు బలపరచాలి..?' అంశంపై తొమ్మిదవ తరగతి విద్యార్థిని కావ్య ప్రసంగించింది. అనంతరం భరత్ రెడ్డి, డైరెక్టర్లు కోగంటి శ్రీకాంత్ బాబు, డాక్టర్ శ్రీవిద్య కొలసాని శ్రీకాంత్‌ల చేతుల మీదగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సుధీర్ కష్ణన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


భరత్‌రెడ్డిని సన్మానిస్తున్న డైరెక్టర్లు


మాట్లాడుతున్న విజయలక్ష్మి

మెప్మా పథకాలపై ఎమ్‌డి విజయలక్ష్మి సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు, పల్నాడు జిల్లాలోని సిఎంఎంలు, సిఒలు, ఆర్‌పిలు, టిఎల్ఎఫ్ఓబి మెంబర్లతో మెప్మాకు సంబంధించిన ప్రభుత్వ సంక్షేమ పథకాలైన టిడ్కో ఇల్లు, జగనన్న మహిళా మార్ట్, ఆసరా, చేయూత, జగనన్న తోడు తదితర అంశాలపై మెప్మా స్టేట్ ఎండి వి. విజయలక్ష్మి అధ్యక్షతన స్థానిక కలెక్టరేట్‌లోని శంకరన్ హల్‌లో సమావేశం నిర్వహించారు. రెండు జిల్లాలకు చెందిన మెప్మా సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునే విధంగా సిబ్బంది ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో మెప్మా పీడీ పి.వెంకటనారాయణ, ఎస్ఎంఎంలు ఆదినారాయణ, శ్రీనివాస్, రంగాచారి, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



2023 క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రజాశక్తి దినపత్రిక 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సిపిఎం తాడేపల్లి మండల సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి బుధవారం సాయంత్రం ఎంటి ఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో ఆవిష్కరించారు. తాడేపల్లి మండల ప్రజలకు ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలును నాయకులు తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం కుంచనపల్లి గ్రామ శాఖ కార్యదర్శులు అమ్మిశెట్టి రంగారావు, కాజా వెంకటేశ్వరరావు, నాయకులు అమ్మిశెట్టి రామారావు తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పరీక్షలో భాష్యం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు

అబాకస్ విధానం ద్వారా గణితంలోని మెళకువలను నేర్చుకొని, ఎంతటి సమస్యనైనా సులువుగా పరిష్కరించవచ్చని ఎక్సెల్ అబాకస్ ఫౌండర్ నన్నక ప్రేమలత అన్నారు. బుధవారం స్థానిక చంద్రమౌళినగర్, భాష్యం లిటిల్ ఛాంప్స్ మెయిన్ క్యాంపస్‌లో జోనల్ స్థాయి ఎక్సెల్ అబాకస్ ఐక్యూఆర్ టెస్ట్‌ను సబ్ జూనియర్స్, జూనియర్లు, సీనియర్లను దశలవారీగా నిర్వహించారు. ఈ పరీక్షలో 2వ తరగతి నుండి 5వ తరగతి వరకూ విద్యార్థులు పాల్గొన్నారు. గుంటూరు అర్బన్ జోన్ నుండి ఐదు బ్రాంచ్‌లు పోటీల్లో పాల్గొనగా, 7 ప్రథమ, 5 ద్వితీయ, 2 తృతీయ మొత్తం 14 బహుమతులను చంద్రమౌళి నగర్ మెయిన్ బ్రాంచ్ విద్యార్థులు కైవశం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గరల్స్ హాస్టల్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుజాత, అర్బన్ జెడ్ఇఒ స్వప్న, అబాకస్ ఫౌండర్ ప్రేమలత చేతులమీదుగా విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. బహుమతులు పొందిన విద్యార్థులను భాష్యం డైరెక్టర్ రామకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో వివిధ బ్రాంచ్‌ల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్

ప్రజాశక్తి - రెంటచింతల

జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వడమే ప్రభుత్వ ధ్యేయమని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ కె.నరేంద్రరెడ్డి అన్నారు. పాల్వాయి గేటు గ్రామంలో చేపట్టిన పనులను బుధవారం ఆయన పర్యవేక్షించారు. నాణ్యతలో రాజీ పడొద్దన్నారు. గ్రామంలో తొలి విడతగా 300 గృహాలకు కనెక్షన్ ఇస్తున్నామని, పనులకు రూ.16.92 లక్షలు కేటాయించారని తెలిపారు. పరిశీలనలో సర్పంచ్ జి.నాగలక్ష్మి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎంపికైన వారిని సత్కరిస్తున్న మేనేజర్ తదితరులు

ఎమ్‌డిఆర్‌డి సదస్సుకు ఎంపికైన వారికి సత్కారం

ప్రజాశక్తి - వినుకొండ

అమెరికాలో నిర్వహించే ఎమ్‌డిఆర్‌డి సదస్సుకు ఎంపికైన సభ్యులను ఎల్ఐసి వినుకొండ బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీ నాయక్, డిఒ శివారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన సత్కార కార్యక్రమంలో లక్ష్మీనాయక్ మాట్లాడుతూ ఎల్ఐసి డిఒఆర్ శివారెడ్డి యూనిట్లో ఇప్పటికి ఏడుగురు ఎమ్‌డిఆర్‌డికి ఎంపికయ్యారని, వీరిలో అందుకుల కొత్తపాలేనికి చెందిన కొలగాని కోటయ్య, సినిగే నారాయణరెడ్డి ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ కోటిరామ్మూర్తి, ఏజెంట్ అసోసియేషన్ అధ్యక్షులు హరినాథ్‌బాబు, బ్రాంచ్ సిబ్బంది, ఏజెంట్లు పాల్గొన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడుగా దొంత అంజి

ప్రజాశక్తి - కారెంపూడి



గౌడ సంఘం మండల అధ్యక్షులుగా దొంత అంజిని నియమించినట్లు పల్నాడు జిల్లా అధ్యక్షులు బెల్లంకొండ సైదులు తెలిపారు. మాచర్ల మండలం తాళ్లపల్లిలో గౌడ సంఘం సమావేశం బుధవారం నిర్వహించగా ఈ సందర్భంగా 2023 కేలండర్‌ను ఆవిష్కరించారు. అంజి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు గౌడ సామాజిక తరగతికి చెందిన అందరికీ అందేలా కృషి చేస్తానన్నారు. అనంతరం అయన్ను జిల్లా అధ్యక్షుడు సైదులు ఆధ్వర్యంలో సత్కరించారు.

అంతుచిక్కని వ్యాధితో ఆవులు మృతి

ప్రజాశక్తి - రెంటచింతల



మండల కేంద్రమైన రెంటచింతలలో బుధవారం నాటికి నాలుగు ఆవులు, దూడలు అంతుచిక్కని వ్యాధితో మృతి చెందాయి. వీటికి మూతి చుట్టూ బొబ్బర్లు వచ్చి మేత మేడం కష్టంగా మారింది. నీళ్లు కూడా తాగలేని పరిస్థితిలో చనిపోయాయి. పశువర్ధక శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని, నివారణపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అప్రమత్తత అంతంతమాత్రమే

ప్రజాశక్తి - చిలకలూరిపేట



ఓమిక్రాన్ వేరియంట్ రూపంలో కోవిడ్ మరోసారి విజృంభించే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వాలు ప్రకటించాయి. అధికారులు సైతం కోవిడ్ నిబంధనలు పాటించాలని సైతం అధికారులు సూచిస్తున్నారు. అయితే ఇవన్నీ మాటలకే పరిమితమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో సరైన పర్యవేక్షణ, అవగాహన కొరవడ్డాయి. ప్రధానంగా పాఠశాలల్లో సరైన జాగ్రత్తలు లేకపోవడం తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది. చిలకలూరిపేట పట్టణంతోపాటు అన్ని ప్రాంతాల్లోని విద్యా సంస్థలు, వాటికి సంబంధించిన బస్సుల్లో మాస్కులతో విద్యార్థులు కనిపించడం లేదు. ఎక్కడో ఒకరిద్దరు మినహా ఎక్కువ మంది సాధారణంగానే కనిపిస్తున్నారు.

పట్టణంలో కోవిడ్ మొదటి దశ కంటే రెండో దశలో ఎక్కువ మంది వైరస్ బారిన పడ్డారు. మూడో దశలోనూ వైరస్ బాగానే వ్యాపించినా ప్రభావం తీవ్రంగా లేకపోవడంతో పెద్దగా ముప్పు అనిపించలేదు. తాజాగా నాలుగో దశ వస్తుందని భావిస్తున్న నేపథ్యంలో కొత్త వేరియంట్ ప్రభావం ఎలా ఉంటుందనే దానిపై సరైన సమాచారం లేకపోవడంతో ఎక్కువ మంది నిబంధనలను పెద్దగా పట్టించుకోవడం లేదు.

చిలకలూరిపేట పట్టణంలోని వివిధ కాలేజీలకు ప్రతిరోజూ 10 వేల మందికి పైగా విద్యార్థులు వస్తారని అంచనా. చిలకలూరిపేట నుండి గుంటూరు, నరసరావుపేట ప్రాంతాలకు వెళ్లేవారు 1500 వరకు ఉంటారు. పాఠశాలల్లో విద్యార్థులు మరీ ఎక్కువ. వీరంతా బస్సుల్లో వచ్చిపోయే సందర్భంలో, విద్యాసంస్థల్లోనూ దగ్గరగా మెలుగుతూ ఉంటారు. వీరిలో ఏ ఒక్కరికి వైరస్ వ్యాపించినా ఇతరులకు త్వరగా సోకుతుందని, ఇళ్లల్లోని వారికీ అది విస్తరిస్తుందనే భయం సర్వత్రా నెలకొంది. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో నిబంధనలు అమలు చేయడం, శానిటైజేషన్ చర్యలు చేపట్టడం ద్వారా ప్రమాదాన్ని తగ్గించొచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో వీటి అమలును పర్యవేక్షించాల్సిన అధికారుల్లో మాత్రం చలనం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ఇవన్నీ ఒకెత్తయితే నివాస ప్రాంతాల్లో, ప్రధాన కూడళ్లలోనూ పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని పలువురు నొక్కి చెబుతున్నారు. బ్లీచింగ్ చల్లడం, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించడం చేయాలంటున్నారు. దీంతోపాటు ప్రభుత్వ విద్యా సంస్థలకు శానిటైజర్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు పి.వెంకటేశ్వర్లు కోరారు. విద్యాసంస్థల పరిసరాల్లో పారిశుధ్య పనులతోపాటు కోవిడ్ జాగ్రత్తలు, నిబంధనలు పాటించడంపై యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని ఐద్వా డివిజన్ నాయకులు భారతి కోరారు.



అగ్ని ప్రమాద బాధితులకు సాయం

- రెండేళ్లుగా ఇళ్లు నిర్మించని ప్రభుత్వం
- టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

బొల్లాపల్లి మండలం పలుకూరు తండాలో మంగళవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు బుధవారం పరామర్శించారు. వారికి శివశక్తి లీల అండ్ అంజన్ ఫౌండేషన్ ద్వారా వంట సామగ్రి, నిత్యావసర సరుకులు, దుప్పట్లు, ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలుకూరు తండాకు చెందిన బనామత్ సక్రు నాయక్, యువరాజ్ నాయక్ ఇళ్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమయ్యాయని, వీరికి ఇళ్లు నిర్మించడంతోపాటు అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రెండేళ్లుగా అనేక మంది అగ్ని ప్రమాదాల్లో ఇళ్లు కోల్పోయినా బాధితులను ప్రభుత్వం ఇంకా ఇళ్లను నిర్మించలేదని, పేదల కష్టాలు సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి పట్టడం లేదని విమర్శించారు. తాజా ఘటనను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం చేయడానికి కృషి చేస్తామన్నారు. వారికి టిడిపి సైతం అన్ని విధాలా అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.నాగేశ్వరరావు, టి.వెంకటేశ్వరరావు, రంగయ్య, హనుమాన్ నాయక్, హుస్సేన్ పాల్గొన్నారు.

స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి - మాచర్ల




స్వామి వివేకానందను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు సూచించారు. స్థానిక కృష్ణవేణి స్కూల్ ఆవరణలో స్వామి వివేకానంద 160వ జయంతి శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. స్వామి వివేకానంద ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన కమిషనర్ మాట్లాడుతూ ఆత్మ విశ్వాసం, ఏకాగ్రతతో ధృడమైన సంకల్పంతో విద్యార్థులు రాణించాలని, వివేకానందుడు కలలుగన్న నవ భారత నిర్మాణం వైపు అడుగులు వేయాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హనుమంతురావు, షేక్ చినలాలుసాహెబ్, సిహెచ్ వెంకటేశ్వరరెడ్డి, గాజున నరసింహరావు, రవి, శ్రీను పాల్గొన్నారు.

నెమలికల్లులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - అమరావతి : మండలంలోని నెమలికల్లు గ్రామంలో టిడిపి ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమంలో బుధవారం నిర్వహించారు. స్థానికుల ఇళ్లకు వెళ్లి సమస్యలు తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం చేశారు. ధరల పెరుగుదలను ప్రస్తావించి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. నాయకులు కె.వసంతరావు, పి.రామకృష్ణ, పి.కోటేశ్వరరావు, వై.శివాజీ పాల్గొన్నారు.





వైఎస్ఆర్ బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - మాచర్ల

పేదలకు వైఎస్ఆర్ బీమా భరోసా ఇస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. వైఎస్ఆర్ బీమా కింద రూ.5 లక్షల చెక్కును లబ్ధిదారు ఎన్.మాత్రిభాయ్‌కు ఆయన తన కార్యాలయంలో బుధవారం అందజేశారు. దుర్గి మండలం నెహ్రూనగర్ తండాకు చెందిన ఎన్.సుమనాయక్ కోతి కరవటంతో ఆనారోగ్యం పాలై మరణించారు. దీనికిగాను బీమాను అందించారు.

'పుడా ఛైర్మన్ పదవి యాదవులకు ఇవ్వాలి'

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పియుడిఎ) ఛైర్మన్ పదవి యాదవ సామాజిక తరగతికి చెందిన వారికి ఇవ్వాలని శ్రీకృష్ణా యాదవ అఫిషియల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ చిలకలూరిపేట గౌరవాధ్యక్షులు గోరంట్ల నారాయణ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. జిల్లాలో యాదవ సామాజిక తరగతి ఎక్కువని, అయినా జిల్లాస్థాయిలో ఒక్క పదవీ ఇవ్వలేదని పేర్కొన్నారు. టిటిడి ఛైర్మన్ పదవిని జంగా కృష్ణమూర్తి యాదవ్‌కు ఇవ్వాలని, ఆయన తొలి నుండి వైసిపిలో ఉన్నారని పేర్కొన్నారు. చిలకలూరిపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవినీ బీసీలకు ఇవ్వాలని కోరారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మనోరంజని

రక్తహీనత నివారణకు ఆకుకూరలు మేలు

ప్రజాశక్తి -పెదనందిపాడు రూరల్

రక్తహీనత నివారణకు ఆకు కూరలు ఎంతో మేలు చేస్తాయని, గర్భిణులు, తల్లులు అధికంగా మెంతికూర, మునగాకు వాడటం వలన రక్తహీనత నివారణతోపాటు చిన్న చిన్న అనారోగ్య సమస్యలు తీరుతాయని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ మనోరంజని అన్నారు. బుధవారం పెదనందిపాడు విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలు రక్తహీనత గల గర్భిణులను, బాలింతలను దత్తత తీసుకొని వారి ఆహార శైలి మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా లోపపోషణ పిల్లలను సాధారణ స్థితికి వచ్చేలా సూచనలు అంగన్వాడీలకు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సిడిపిఓ సుజాత దేవి అధ్యక్షత వహించగా కార్యక్రమంలో సూపర్వైజర్ జరీనా, భారతి,.రాజ్యలక్ష్మి, వెంకటరత్నం, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి లీగల్ సెల్ ప్రతినిధిగా రాజేష్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడేపల్లి



బుర్రముక్కు రాజేష్‌రెడ్డి

టిడిపి మంగళగిరి నియోగజకవర్గ లీగల్ సెల్ అధికార ప్రతినిధిగా తాడేపల్లికి చెందిన బుర్రముక్కు రాజేష్‌రెడ్డి నియమితులయ్యారు. ఆ మేరకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. రాజేష్‌రెడ్డి నియామకం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.



సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

అంజుమన్ కమిటీకి రూ. 2.50లక్షల విరాళం

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

పట్టణంలోని అంజుమన్ ఏ ఇస్లామియా వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చిష్టి అల్తాఫ్ హుస్సేన్ శాశ్వత సభ్యత్వాన్ని నమోదు చేయించుకున్నారు. పొన్నూరు అంజుమన్ -ఏ ఇస్లామియా వెల్ఫేర్ సొసైటీ ముస్లిం సమాజానికి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి స్వచ్ఛందంగా తన శాశ్వత సభ్యత్వాన్ని నమోదు చేయించుకుని నూతనంగా నిర్మించబోయే అంజుమన్ షాపింగ్ కాంప్లెక్స్‌కు తన వంతు ఒక షాపుకు అయ్యే ఖర్చును రూ.2,50,00లను విరాళంగా ఇస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అంజుమన్ ఏ ఇస్లామియా వెల్ఫేర్ సొసైటీ కమిటీ సభ్యులు డాక్టర్ చిష్టి అల్తాఫ్ హుసేన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అమోదించిన పనులను నూరు శాతం వెంటనే గ్రౌండింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అబివృద్ధి, సంక్షేమ పథకాల అమలు పురోగతిపై మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, హౌసింగ్, పంచాయితీరాజ్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరు చేసిన పనుల గ్రౌండింగ్ జరిగేలా సంబంధిత శాఖ జిల్లా స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసిన సచివాలయాల పరిధిలో గుర్తించిన పనులకు వెంటనే ప్రతిపాదనలు అందించాలన్నారు. సామాజిక భద్రత పెన్షన్ జనవరి నుంచి రూ.2500ల నుండి రూ.2750లకు పెంచుతున్నందున డీఆర్డీఏ అధికారులు జారీ చేసిన



విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

మార్గదర్శకాల ప్రకారం మండలాల్లో కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. రబీ పంట ఈ-క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని, మండల స్థాయిలో ఈ- క్రాప్ బుకింగ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సమీక్షించి ప్రతి రోజు నివేదిక అందించాలన్నారు. మద్ధతు ధరకు ధాన్యం కొనుగోలు నిర్దేశిత లక్ష్యాలు అధిగమించేలా పౌర సరఫరాల సంస్థ, స్థానిక వ్యవసాయ, రెవెన్యూ అధికారుల సహకారంతో చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కలెక్టరేట్ హౌసింగ్ పీడీ సాయినాథ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గణేష్‌ను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కళాకారుడు గణేష్‌కు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్ :ప్రముఖ రికార్డింగ్ స్టూడియో అధినేత, గాయకులు తాడిపర్తి గణేష్‌ను ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవ కమిటీ బుధవారం సత్కరించింది. స్థానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ నటించిన కలియుగరాముడు చిత్రాన్ని ప్రదర్శించారు. అలాగే కళాకారుల సత్కారాల్లో భాగంగా పట్టణానికి చెందిన రికార్డింగ్ స్టూడియో కళాకారుడు గణేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కొండా రమాదేవి, షేక్ షాహిదా, కాసుల లక్ష్మి, మునగాల జ్యోతిప్రియ, బొంతా సురేష్, కర్నాటి బాలిరెడ్డి, చెరుకుమల్లి సింగారావు, టి.శివనాగసత్య, పి.పోతురాజు, ఎం.రాఘవరావు, డి.భవాని పాల్గొన్నారు.



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

సచివాలయాలల్లో కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలోని 16, 22 వార్డుల్లోని 20, 26వ వార్డు సచివాలయాలను బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల్లో సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణ, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ప్రచార పోస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ సచివాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే సందర్శకులతో సిబ్బంది మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. కమిషనర్ వెంట సచివాలయాల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి

ప్రజాశక్తి- మంగళగిరి

మంగళగిరి - తాడేపల్లి నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావులు ఇంజనీరింగ్ విభాగం అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై, నిర్వహించాల్సిన పనులపై సమావేశంలో చర్చించారు. కార్పొరేషన్ పరిధిలో 14, 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్వహించాల్సిన పనులను ఫిబ్రవరి నెల నాటికి పూర్తి చేయాలని కార్పొరేషన్, ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు చేశారు. కొన్ని పనులు టెండర్ ప్రక్రియలో ఉండగా మరికొన్ని నిర్మాణం జరుగుతున్నాయని, మరికొన్ని త్వరలోనే టెండర్లు పిలిచి పనులను ప్రారంభించడం జరుగుతుందని కార్పొరేషన్ అధికారులు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కేలకు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో చేపట్టాల్సిన పనులన్నింటిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆర్కే అన్నారు. సమావేశంలో ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి పాల్గొన్నారు.

సంస్కృతి సాంప్రదాయాలు భావితరాలకు అందించాలి

ప్రజాశక్తి- దుగ్గిరాల

సంస్కృతి సాంప్రదాయ కళలు భావి తరాల వారికి అందించాలని, తాము చేస్తున్న ఈ చిరు ప్రయత్నానికి ప్రజలు సహృదయంతో ఆదరించాలని ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ అన్నారు. దుగ్గిరాలలో బుధవారం గ్రామానికి చెందిన నంబర్ వన్ సేవా ట్రస్ట్ దోస్త్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు నిర్వహించటం గతం నుండి ఆనవాయితీగా వస్తుందన్నారు. అనంతరం మెడికల్ క్యాంప్ సంక్రాంతి సంబరాలకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సంబరాల్లో భాగంగా జనవరి 10వ తేదీన స్థానిక జంపాల వారి కళ్యాణమండపంలో తానా ఫౌండేషన్ (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) మరియు గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం, మణిపాల్ హాస్పిటల్ విజయవాడ వారిచే గుండెకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారు. జనవరి 11వ తేదీన ఆరో తరగతి నుండి ఇంటర్మీడియట్ స్థాయి వరకు బాల బాలికలకు వివిధ రకాల ఆటలు పోటీలు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు కూడా అందజేస్తారు. జనవరి 14వ తేదిన ఉదయం 6 గంటల నుండి సంక్రాంతి సంబరాలు ప్రారంభమవుతాయి. భోగి మంటలు, కోలాటాలు, గంగిరెద్దులు, హరిదాసు కీర్తనలు మేళ తాళాలతో బోసు బొమ్మ వద్ద నుండి కాలేజీ వరకు రెండు కిలోమీటర్లు ర్యాలీ నిర్వహిస్తారు. అనంతరం స్థానిక



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎన్నికల మాజీ కమిషనర్ తదితరులు

కంభం పాటి నారాయణ డిగ్రీ కళాశాల వద్ద సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దోస్త్ అధ్యక్షులు ఎం. గాంధీ, మాజీ ఎంపీపీ వి. శ్రీకృష్ణ ప్రసాద్ , మాజీ సర్పంచ్ జె. వెంకటకృష్ణారావు, ఇన్సాన్ గ్యాస్ అధినేత గద్దె శ్రీనివాసరావు, జె.నరేంద్ర , జె.కుసుమకుమారి, కె. రవీంద్ర , గద్దె రవీంద్ర తదితరులు పాల్గొన్నారు



ఈ-పాస్ యంత్రాలును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే తదితరులు

క్లాప్ బిల్లుల వసూళ్ళకు ఈ-పాస్ యంత్రాలు

ప్రజాశక్తి- మంగళగిరి

మంగళగిరి - తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వార్డుల్లో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కార్యక్రమంలో భాగంగా చెత్తపన్ను వసూళ్లకు ఈ- పాస్ యంత్రాలు ప్రభుత్వం వినయోగంలోకి తిసుకోచ్చింది. బుధవారం నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ,ఎమ్మెల్సీ మురగుడు హనుమంతురావు, కమిషనర్ శారదదేవి లు వాటిని ఆవిష్కరించారు. ఈ పాస్ యంత్రాలు ప్రభుత్వం జారీ చేసిన యూజర్ చార్జీలను గృహాల నుండి వసూలు చేసి తగిన రశీదు తక్షణమే అంద చేయుటకు ఉపయోగపడతాయని వారు తెలిపారు. అనంతరం ఈ-పాస్ యంత్రాల పనితీరుగురించి సచివాలయ సిబ్బందికి టెక్నికల్ టీమ్ సభ్యులు అవగాహన కల్పించారు. యూజర్ చార్జీలను ఇచ్చిన వెంటనే అక్కడే రసీదు ఇచ్చేవిధంగా ఈ యంత్రం పనిచేస్తుందని తెలిపారు.కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ హేమామాలిని, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీ పతిరావు, సెక్రెటరీ పి.శ్రీనివాసరావు మరియు సచివాలయ, శానిటేషన్ సెక్రటరీ లు పాల్గొన్నారు.



విజయకీలాద్రిలో నేపాల్ వాసులు

ప్రజాశక్తి-తాడేపల్లి

సీతానగరంలోని విజయకీలాద్రి దివ్య క్షేత్రాన్ని బుధవారం నేపాల్‌కు చెందిన యాత్రికులు సందర్శించారు. సీతానగరం కొండ కింద నుంచి వారు కాలినడకన వెళ్లి విజయకీలాద్రిని దర్శించుకున్నారు. స్థానిక నిర్వాహకులు వారికి స్వాగతం పలికారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కేశన శంకర్ రావు

హక్కులను కాపాడుకునేందుకు కలిసి పోరాడదాం

ప్రజాశక్తి- కొల్లిపర

బడుగు బలహీన వర్గాల హక్కులను కాపాడుకోవడానికి కలసి పోరాటం సాగిద్దామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్‌రావు అన్నారు. మండల కేంద్రమైన కొల్లిపరలోని బీసీ కాలనీలో స్థానిక నేతలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జనవరి 7వ తేదీన బడుగు బలహీన వర్గాల ఆధ్వర్యంలో తెనాలిలో జరిగే ప్రదర్శనలో మండలంలోని బడుగు బలహీన వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ ప్రదర్శన తెనాలి మార్కెట్ యార్డ్ నుండి ప్రారంభమై చినరావూరు వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రదర్శనకు సంబంధించిన కరపత్రాలను స్థానిక నేతలతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం గంగాధర యాదవ్, కే సాంబశివరావు, పి సుబ్బారావు ,పి కేశవులు, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు

విజ్ఞాన్స్ లారా అధ్యాపకురాలికి పీహెచ్‌డీ



ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలోని మేనేజ్‌మెంట్ స్టడీస్ డిపార్ట్‌మెంట్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ రామిశెట్టి వి.నాగశైలజకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందజేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్ బుధవారం తెలిపారు. 'మీడియేటింగ్ అఫెక్ట్ ఆఫ్ టాలెంట్ డెవలప్‌మెంట్ ఆన్ ఎంప్లాయి అగిలిటీ అండ్ ఇన్నోవేషన్స్' అనే అంశంపై ఆమె పరిశోధన చేశారన్నారు. ఏఎన్‌యూలోని హెచ్‌ఆర్‌ఎం అండ్ ఎంబీఏ (హెచ్‌ఏ) విభాగాధిపతి డాక్టర్ వి.తులసీదాస్ గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. నాగశైలజను ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

కోటంరాజు అపర్ణ సీతారాంకు డాక్టరేట్



ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల కెమిస్ట్రీ విభాగాధిపతి, జవహర్ నాలెడ్జ్ సెంటర్ కో ఆర్డినేటర్ కోటంరాజు అపర్ణ సీతారాంకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ద్వారా 'ఏ స్టడీ ఆఫ్ మాలిక్యులర్ ఇంటరాక్షన్స్ ఆఫ్ ఈస్టర్స్ విత్ ఫ్యూ డెరివేటివ్స్ ఆఫ్ పాపులర్ ఆల్కహాల్స్' అంశంపై చేసిన పరిశోధనకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పిహెచ్‌డి) ప్రధానం చేశారు. అపర్ణ సీతారాం ఏఎన్‌యు విశ్రాంత ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్యాంసుందర్ మార్గదర్శకంలో, డాక్టర్ పి.కిరణ్మయి సహకారంతో పరిశోధన చేశారు.ఈ సందర్భంగా అపర్ణ సీతారాంకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రమాజ్యోత్స్నకుమారి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

వివిఐటి అధ్యాపకురాలు చల్లా మాధవికి డాక్టరేట్

ప్రజాశక్తి-తెనాలి



అధ్యాపకురాలిని అభినందిస్తున్న చైర్మన్ విద్యాసాగర్

వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల నంబూరులోని సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న చల్లా మాధవి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బుధవారం కళాశాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో మాధవి చేసిన పరిశోధనలకు గాను ద్రవిడియన్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసినట్లు చెప్పారు. ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన గ్రంధాలయాల్లో వసతులు, సేవలు, వినియోగదారులు అంచనా మరియు అవగాహన అనే అంశంపై ద్రవిడియన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.దొరస్వామి పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనా పత్రాలకు ఆమె డాక్టరేట్ అందుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సెక్రటరీ సూర్యదేవర బదరి ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లిఖార్జునరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ వైవిఎస్ఎస్ఎస్‌వి ప్రసాదరావు, డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్‌ఆఫ్ అడిస్మన్ డాక్టర్ కుమారస్వామి పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధిలో కిట్స్‌కు జాతీయ ర్యాంకు

ప్రజాశక్తి-గుంటూరు



అధ్యాపకుడు రమేష్‌ను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు

విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిని, అంతర్జాతీయ, జాతీయ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్, ప్లేస్‌మెంట్స్ అందించటంలో కిట్స్ ఇంజినీరింగ్ కాలేజి అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకుగాను అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఎఐసిటిఇ) నుంచి జాతీయ స్థాయిలో 19వ ర్యాంకు లభించిందని కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. ఈనెల 23న న్యూఢిల్లీలో ప్రతిష్టాత్మక ఎఐసిటిఇ- ఎడ్యుస్కిల్స్ నిర్వహించిన నెక్స్ట్‌జెన్ స్కిల్ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న ప్రసన్నకుమార్ సెలోనిస్‌లో చూపిన ప్రతిభకు ఉత్తమ ఎడ్యుకేటర్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారన్నారు. కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రసన్నకుమార్‌ను ఈ అవార్డు అందుకున్నందుకు, ఆయనకు తోడ్పాటు అందించిన విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.రమేష్‌ను కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రెటరీ కోయి శేఖర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు అభినందించారు.

హెవీ మోటార్ వెహికిల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగిన డ్రైవర్లకు గుంటూరు 2 డిపోలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ ట్రైనింగ్ స్కూల్ ప్రారంభించినట్లు ఎస్‌కె అబ్దుల్ సలామ్ తెలిపారు. ఈ డ్రైవింగ్ స్కూల్‌లో ఇప్పటి వరకు 9 బ్యాచ్‌లు శిక్షణ పూర్తి చేసుకుని, 10వ బ్యాచ్ అతి త్వరలో ప్రారంభించబడుతుందన్నారు. కావున శిక్షణ పొందటానికి పేరు నమోదు చేయించుకోవాలని, బ్యాచ్‌కి 16 సీట్లు మాత్రమే ఉంటాయన్నారు. ప్రతిరోజూ గంట వాహనం యొక్క వివిధ భాగాల గురించి, వాటి పనితీరు గురించి, వివిధ రకాల రోడ్ల గురించి, రోడ్లపైన ఉండే పెయింటింగ్ మార్కుల గురించి సవివరంగా చెప్పటం జరుగుతుందన్నారు.ప్రతి రోజూ ప్రాక్టికల్‌గా ప్రతి ఒక్కరితో పదిహేను కిలోమీటర్లు బస్సును నడిపిస్తామన్నారు. వీడియో విజువల్స్ ద్వారా ప్రమాదాలు జరిగే తీరు చూపించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించీ వివరిస్తామన్నారు. ఘాట్ రోడ్డులో ఎటువంటి భయం లేకుండా నడపటానికి కొండవీడు ఘాట్ రోడ్డులో, కోటప్పకొండ ఘాట్ రోడ్డులో బస్ నడిపిస్తామన్నారు. శిక్షణ పూర్తి అయ్యాక ఫామ్-5, పామ్ 5ఎ సర్టిఫికెట్లు జారీ చేస్తామని, తద్వారా అభ్యర్థి ఆర్‌టిఎ నిర్వహించే టెస్ట్‌లో పాల్గొని లైసెన్స్ పొందవచ్చన్నారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి. వివరాలకు 8897371003, 7382894585 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఇళ్లకు ఇబ్బంది లేకుండా రోడ్ల విస్తరణ

- భూసేకరణకు ముందే ప్రజలతో సమావేశాలు
- తొలగించాల్సిన వాటిపై పూర్తిస్థాయిలో నివేదించాలి
- జాతీయ రహదారుల విస్తరణపై సమీక్షలో

ఎంపి శ్రీకృష్ణదేవరాయులు, పల్నాడు కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధిలో భాగంగా భూసేకరణ సందర్భంలో ప్రజల ఇళ్లకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. జాతీయ రహదార్ల విస్తరణపై కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం నిర్వహించిన సమీక్షలకు కలెక్టర్‌తోపాటు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జెసి, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. జాతీయ రహదార్ల విస్తరణకు అంచనాలు, భూసేకరణ, పరిహారం పంపిణీ, పనులు, విద్యుత్, తాగునీటి కాల్వలు, వంతెనల నిర్మాణం, ప్రజల నివాసాల తొలగింపు తదితర అంశాలపై చర్చించారు. ఎన్‌హెచ్ 167 ఏడి : మాచర్ల టు గురజాల, ఎన్‌హెచ్ 565 : నాగార్జునసాగర్ టు దేవుళ్లపల్లి, ఎన్‌హెచ్ 167 ఏ : నకిరేకల్లు టు ఓడరేవు, ఎన్‌హెచ్ 167ఏజీ : కొండమోడు టు పేరిచర్ల, ఎన్‌హెచ్ 544డి : వినుకొండ టు గుంటూరుకు చెందిన ఐదు జాతీయ రహదారుల విస్తరణపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ విస్తరణ పనులకు విద్యుత్తు లైన్లు అడ్డుగా ఉంటే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్ లైన్లను మార్చేందుకు అంచనాలను రూపొందించాలని, సంబంధిత శాఖ ఉన్నతాధికారుల అనుమతి తీసుకునే పనులు చేయాలని చెప్పారు. సాగునీటి కాల్వలు, పైపులైన్ల నిర్మాణాలున్నచోట ప్రభుత్వానికి ప్రత్యామ్నాయ మార్గం చూపడంతో పాటు వాటికయ్యే అంచనాలను ఉన్నతాధికారులకు ఇవ్వాలన్నారు. భూసేకరణ చేపట్టే ముందు, రైతులు, ప్రజలతో ముందుగానే ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలని, ప్రజల వారికి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయిలో విస్తరణకు సమన్వయంగా వ్యవహరించాలని సూచించారు. ఆయా నివేదికలను కలెక్టరేట్‌కు పంపాలని చెప్పారు. ఇబ్బందులేమున్నా సరైన సమాచారం సేకరించి, నిధుల ప్రణాళిక, ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ కోసం చర్యలు తీసుకోవాలన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి

ట్యాబ్‌లు నూరు శాతం పంపిణీ చేయాలి : పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో విద్యా శాఖకు సంబంధించిన నాడు - నేడు పనులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఆయా శాఖల జిల్లా, రెవెన్యూ, మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మిగతా జిల్లాల కన్నా మెరుగ్గా నాడు - నేడు పనులను పూర్తి చేసేందుకు సమన్వయంతో పని చేయాలని సూచించారు. దీంతో పాటు బైజూస్ యాప్ పనుల పురోగతి పై ఆరా తీశారు. విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల్లో బై జూస్ యాప్ డౌన్ లోడ్ చేయడం, పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. ఇంకా ట్యాబ్ లు పంపిణీ కాని చోట త్వరిత గతిన స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా వంద శాతం పంపిణీ చేయాలని మండల విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. పంపిణీ తరువాత టీచర్లు వద్ద ఉన్న ట్యాబ్ లను నరసరావు పేట ఎమ్. ఆర్. సి. లో అంద జేయాలని ఆదేశించారు. పనుల్లో ఎక్కడా జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యా శాఖ అధికారులు, అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హెడ్‌కానిస్టేబుల్ కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న ఎఎస్‌పి సుప్రజ

హెడ్‌కానిస్టేబుల్స్ కుటుంబాలకు పరిహారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా లోని పోలీసుశాఖలో పనిచేస్తూ అనారోగ్యం సమస్యలతో మరణించిన ముగ్గురు హెడ్ కానిస్టేబుల్స్ కుటుంబాలకు జిల్లా అదనపు ఎస్‌పి సుప్రజ ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున కార్పస్ ఫండ్ పరిహారం అందించారు. ఈమేరకు ఈ మూడు కుటుంబాలకు బుధవారం చెక్కులు పంపిణీ చేశారు. చేబ్రోలుకు చెందిన మాధవ, వట్టిచెరకూరుకు చెందిన విజయ రాజ్ కుమార్, గుంటూరు ఈస్టు ట్రాఫిక్ విభాగంలో పనిచేసిన శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు చెక్కులు అందచేశారు.

విద్యారంగంలో సమూల మార్పులు

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీలో గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైస్ జగన్మోహన్‌రెడ్డి ఎపిలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద, నాడు-నేడు వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ముస్తఫా అన్నారు. బుధవారం ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ కార్యక్రమం స్థానిక చౌత్ర, పాల హాస్పిటల్ వద్ద గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు మహమ్మద్ ముస్తఫా అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు తదితరులు పాల్గొని విద్యార్థులకు ట్యాబ్‌లు అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు రూ.49 కోట్ల ఖర్చుతో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు, టీచర్లకు 15,343 ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. విద్యారంగంలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో సమూల మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో వసతులు కంటే ప్రైవేటు పాఠశాలల్లో ఆటస్థలం, అనుభవం కలిగిన



ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థినులతో కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి విద్యారంగంలో సమూలమైన మార్పులు తీసుకువచ్చి నిరక్షరాస్యతను సమూలంగా నిర్మూలించడానికి కృషి చేస్తున్న వ్యక్తని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఇఒ శైలజ, డిప్యూటీ మేయర్ సజిలా, బలిజ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని, డిప్యూటీ డిఇఒ సుధాకర్ రెడ్డి, యంఇఒ ఖుద్దూస్, కార్పొరేటర్ ఖాజా మోయిద్దీన్ చిస్టీ పాల్గొన్నారు.